www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 ఏప్రిల్ 2023
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 పంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీస్ పిఎస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

రైతుల భూ సమస్య పరిష్కారం కోసమే రీసర్వే

జిల్లా భూ రికార్డుల సర్వే శాఖ సహాయ సంచాలకులు టి.జయరాజ్



ముఖా ముఖి..

ప్రజాశక్తి రాయచోటి

జిల్లాలోని రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం భూ రీసర్వే చేస్తున్నట్లు జిల్లా భూ రికార్డులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు టి. జయరాజ్ పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాల్లో రీ సర్వే ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి ? సర్వేయర్లు ఎంతమంది ఉన్నారు?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 30 మండలాలున్నాయి. రెవెన్యూ గ్రామాలు 470 ఉన్నాయి . మండల సర్వేయర్లు 39 మంది, విలేజ్ సర్వేర్లు 400 మంది ఉన్నారు.

భూ రీ సర్వే ఎన్ని గ్రామాలలో జరుగుతోంది?

భూ రీ సర్వే 2019వ సంవత్సరంలో ప్రారంభించాం. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 109 గ్రామాలలో భూ రీ సర్వే నిర్వహించాం. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం నిర్దేశించిన ఏడాది లోపల భూ రీ సర్వే జిల్లా వ్యాప్తంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

భూ రీ సర్వే పూర్తయితే ఎలంటి సమస్యలు పరిష్కారమవుతాయి?

భూ రీసర్వే జరిగిన తరువాత భూమిపై 100 శాతం సమస్యలు పరిష్కారమవుతాయి. గంటల వ్యవధిలో సమస్య పరిష్కారం అవుతాయి. సర్వే అంటే భయపడాల్సిన అవసరం లేదు. గతంలో మాదిరిగా హద్దు చేరిపేస్తే మారిపోతుందనుకునేవి భ్రమలుగా తొలగిపోతాయి. క్యూఆర్ కోడ్ ద్వారా పక్కా సర్వే జరిగుతుంది. ఒక్క సారి రీ సర్వే జరిగిందంటే ఆ భూమి రికార్డులు పదిలంగా ఉంటాయి. మ్యూటేషన్లు, ఇలా ఎన్ని సార్లు భూములు బదలాయించినా రికార్డులు మాత్ర తారుమారు అయ్యే ఆస్కారం ఉండదు. భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు ఉండవు.

సర్వే సమయంలో రైతుల నుంచి సమస్యలు ఏమైనా తలెత్తాయా?

కొన్ని ప్రాంతాలలో రైతు రికార్డులు ఉన్నంతవరకు భూముల రీ సర్వే చేసి తమ పేర్ల పైన నమోదు చేయాలంటున్నారు. వారు ఎంత అనుభవిస్తున్నారు, రీ సర్వే చేసి వారి పేరుతో రికార్డులో నమోదు చేస్తున్నాం. కావున అక్కడక్కడ కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఆర్డీవో, తహశీల్దార్, స్థానిక విఆర్వోల సహకారంతో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. జిల్లాలో చెప్పుకోదగ్గ సమస్యలైతే లేవు.

సర్వే చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనా?

భూ యజమాని తన భూమిని కొనాలన్నా, స్థలం చూపించాలన్నా అర్జీ పెట్టుకోవాలి. ప్రభుత్వానికి నేరుగా డిడి, చలానా రూపంలో రూ.2 వేల భూమి కొలతల మేర చలానా చెల్లించాలి. ఇది మినహా సర్వేయర్ అదనంగా ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. బ్రీజర్ రీ సర్వేలో రాళ్లు కూడా ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా డబ్బులు అడిగినట్లు తమ దృష్టికి తీసుకొస్తే వారి పైన చర్యలు తీసుకుంటాం.

సిబ్బంది కొరత సమస్య ఏమైనా ఉందా?

గతంలో భూ రికార్డుల సర్వే శాఖలు సిబ్బంది కొరత ఉండేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రతి సచివాలయానికి ఒక సర్వేయర్, మండలానికి మరో సర్వేయర్ ఉన్నారు. అర్జీలు వచ్చిన వెంటనే ఆ గ్రామ సచివాలయ సర్వేర్ కొలతలు వేస్తున్నారు సిబ్బంది కొరతతో ఎలాంటి సమస్య లేదు .

పండగ పూట విషాదం

సరదా కోసం ఈతకు వెళ్లి ముగ్గురు మృత్యువాత
మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఒక యువకుడు
అలవలపాడులో విషాద ఛాయలు

ఈస్టర్ పండగ రోజు ఆనందంగా గడపాల్సిన వారు సరదా కోసం ఈత కెళ్లి మృతువాత పడ్డారు. ఈ సంఘటన వేంపల్లె మండలంలోని అలవలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు..



మృతులు అక్కా తమ్ముడు సాయితేజశ్రీ, సుశాంత్, యువకుడు జానయ్య

ప్రజాశక్తి-వేంపల్లె

మండలంలోని అలవలపాడు ఎస్సి కాలనీకి చెందిన అక్కా తమ్ముడు సుశాంత్ (10), సాయి తేజశ్రీ (11), వారి మేనమామ శశికుమార్‌తోపాటు వేమల మండలం వేల్పుల గ్రామానికి చెందిన జానయ్య (25) కలిసి ఆదివారం ఈస్టర్ పండగ సందర్భంగా సరదాగా గ్రామ సమీపంలోని జిఎన్ఎస్ఎస్ పంట కాల్వల వద్దకు ఈత కోసం వెళ్లారు. మొదటగా ఇద్దరు చిన్నారులు కాలువలోకి దిగారు. కాల్వలో బురద మట్టి ఎక్కువగా ఉండడంతో వారు అందులో ఇరుక్కుపోయారు. జానయ్య అనే యు వకుడు ఇద్దరు చిన్నారులను కాపాడే ప్రయత్నంలో అతనూ అందులో చిక్కుకుని పోయాడు. వారి ముగ్గురి ఆచూకీ కోసం చిన్నారుల మేనమామ శశికుమార్ వెతికాడు. వారు కన్పించకపోవడంతో వెనుదిరిగి గట్టుపైకి వచ్చాడు. కాలువ సమీపంలో పనిచేస్తున్న కొందరు వ్యక్తులతో పాటు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బాలస్వామిరెడ్డి సభ్యులు కాల్వలోకి దిగి బురదలో చిక్కుకున్న ముగ్గురిని బయటకు తీశారు. అప్పటికే ముగ్గురు మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తిరుపాల్‌నాయక్ పేర్కొన్నారు.



చిన్నారుల మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

ఏడాది కిందటే రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

చిన్నారుల తల్లిదండ్రులు రూతు, సురేష్‌కుమార్. వారిది చక్రాయపేట మండలం చిలేకాంపల్లె. ఏడాది కిందట తల్లి రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. దీంతో వారు వేంపల్లె మండలంలోని అలవలపాడులో తమ అవ్వా, తాతల వద్ద ఉంటూ నారాయణ పాఠశాలలో 5,6 తరగతులు చదువుకుంటున్నారు. చిన్నారుల తండ్రి ఎర్రగుంట్ల డాబాలో వంట మాస్టర్‌గా పని చేస్తూ పిల్లల్ని చదివించుకుంటున్నాడు. ఈస్టర్ పండగ కావడంతో బంధువులతో కలిసి గ్రామ సమీపంలోని ఎస్సి కాలనీలో సంతోషంగా పండుగ జరుపుకున్నారు. మేనమామ శశికుమార్‌తో కలిసి ఇద్దరు చిన్నారులు, సమీప బంధువైన వేంపల్లె మండలానికి చెందిన జానయ్య కూడా కాలువ వద్దకు ఈత కోసం వెళ్లి మృతువాత పడ్డారు.

పెళ్లైన ఆరు నెలలకే..

ఇదిలా ఉండగా జానయ్య పులివెందులలో మెకానిక్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఆరు నెలల కిందటే వీరపునాయనపల్లె మండలం పాలగిరికి చెందిన శృతి అనే అమ్మాయితో వివాహమైంది. ఇద్దరు చిన్నారులను కాపాడబోయే మృత్యువాత పడడంతో అతని కుటుంబంలోనూ తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లైన ఆరు నెలలకే జానయ్య మృతి చెందడంతో బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా మృతుడి తండ్రి గత డిసెంబర్‌లో విద్యు దాఘాతంతో మృతిచెందాడు.

శోకసంద్రంలో బంధువులు

పండుగ రోజు ముగ్గురు నీటిలో పడి చనిపోవడంతో అలవలపాడు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. మృతదేహాలను చూసేందుకు వచ్చిన బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏడాది కిందట భార్యను, ఇప్పుడు పిల్లలిద్దరిని కోల్పోవడంతో సురేష్‌కుమార్ బాధకు అంతు లేకుండా పోయింది. మరో వైపు వివాహమైన ఆరు నెలలకే భర్తను కోల్పోయిన జానయ్య సతీమణి శృతి కన్నీరు మున్నీరుగా విలపించింది. దీంతో ఇరు కుటుంబాల బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు.


ప్రమాద వశాత్తు లోయలో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్



మృతుడు ఇస్మాయిల్

మండలంలోని గండికోట వద్దనున్న లోయలో ప్రమాదవశాత్తు కాలు జారీ పడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు.. విజయవాడ నుంచి ఇస్మాయిల్ (23) తన స్నేహితులు పవన్, సతీష్, కార్తీక్ కలిసి గండికోట చూడడానికి వచ్చారు. అక్కడి రోప్‌వేకు సమీపంలో ఉన్న కొలను వద్ద స్నేహితులతో కలసి ఇస్మాయిల్ ఈత కొట్టాడు. అనంతరం డ్రస్సు మార్చు కుంటూ ఉండగా ప్రమాద వశాత్తు పక్కనున్న లోయలో పడిపోయాడు. వెంటనే అతని స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ సదాశివయ్య, ఎస్ఐ సుబ్బారావు తమ సిబ్బంది సాయంతో ఇస్మా యిల్‌ను లోయనుంచి బయటకు తీశారు. అప్పటికే అతను చనిపోయాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు విజయవాడలో యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగి పనిచేస్తున్నాడు. మృతుడికి తల్లిదండ్రులు ఆశా, బాజీ, చెల్లి ఉన్నారు. తండ్రి విజయవాడలోనే కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు.



వైభవంగా శ్రీ కోదండరాముడి

పుష్పయాగం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం సాయంత్రం పుష్పయాగం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన పుష్పయాగం రాత్రి 9 గంటలకు ముగిసింది. ఇందులో తులసీదళాలు, మల్లెలు, రోజా, చామంతి, గన్నేరు, నూరువరహాలు, మొగలి తదితర 11 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దాతలు 2.5 టన్నుల పుష్పాలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సీనియర్ సిటిజన్స్‌కు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని జిఆర్‌టి హై స్కూల్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.ముణి గోపాలకృష్ణ, గౌరవాధ్యక్షులు వై ఎస్. మునిరత్నం, ఉపాధ్యక్షులు జగన్మోహన్ ఆధ్వర్యంలో బావ మెడికల్స్ వారి తరపున ఆదివారం వంద మంది సీనియర్ సిటిజన్స్‌కు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే రెండవ ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అవకాశాన్ని సీనియర్ సిటిజన్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పాల్గొని సభ్యులకు ఐడెంటి కార్డును పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, శకుంతలమ్మ, రామచంద్రయ్య, కృష్ణ కుమార్, రమణ, గొల్లపూడి తిరుపతి రావు, టి.ఎన్. కృష్ణమూర్తి, ప్రొఫెసర్ శ్రీనివాసులు, కరుణాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

కోర్టు తీర్పులో ద్వంద్వ వైఖరి తగదు

ప్రజాశక్తి -రాయచోటి

వాకపల్లి కేసులో దోషులను రక్షిస్తూ వచ్చిన కోర్టు తీర్పులో ద్వంద్వ వైఖరిని ఖండిస్తున్నామని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు నియోజకవర్గంలోని జి.మాడుగుల మండలం నర్మతి పంచాయతీ పరిధిలో వాకపల్లి గ్రామంలో 2007 ఆగస్టు 20న మగవారు వేకువ జామున మూడు గంటల ప్రాంతంలో పొలం పనులకు వెళ్లిన సమయంలో 21 మంది గ్రేహౌండ్స్ పోలీసులు గ్రామం పై విరుచు కుపడ్డారున్నారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ బూతులు తిడుతూ, దౌర్జన్యంగా ఇళ్లల్లో దూరి వంటగదిలో ఉన్న మహిళలపై అత్యాచారం చేశారున్నారు. సంఘటన జరిగి 16 ఏళ్ల తరువాత బాధితులు వేసిన కేసులో విచారణ సరిగ్గా చేపట్టలేదని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారుల తీరు పట్ల ఆధారాలు లభించని కారణంగా పోలీసులను విడిచి పెడుతున్నాం అని కోర్టు దోషులపై కేసు కొట్టి వేసిందిన్నారు. అత్యాచారం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం .రవిశంకర్, చైతన్య మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఝాన్సీ లక్ష్మి, దళిత నాయకులు కొత్రాళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజకీయశక్తిగా ఎదుగుతాం : బిసి జెఎసి

ప్రజాశక్తి - రాయచోటి

ఇకపై తమ కులం బిసి అని బిసి జెఎసి నాయకులు టి. నాగేశ్వరావు వాల్మీకి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జగదాంబ సెంటర్ లోని వైష్ణవి స్టడీ సెంటర్‌లో నియోజకవర్గపు బిసి జెఎసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు ఏవైనా తామంతా బిసిలేనని, తమలోని లోపాలను సరిదిద్దుకుని రాయచోటి నియోజకవర్గంలో బలమైన నిర్ణయాత్మక రాజకీయ శక్తిగా ఎదుగుతామని ప్రకటించారు. అనంతరం నియోజకవర్గపు బిసి నాయకులు, ఉద్యోగులు, మేధావులు , వివిధ కుల సం ఘాల నాయకులతో బిసి కులాల ఐక్యవేదిక ఏర్పాటు చేశారు. మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాండ్ల రెడ్డివర ప్రసాద్,రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎకిల రామాంజనేయులు, వడ్డెర మేధావుల ఫోరం కన్వీనర్ కె.జీవానందం మాట్లాడారు. రాయచోటిలో బిసి ఓట్లు 70 శాతానికి మించి ఉన్నప్పటికీ ఏడు దశాబ్దాలుగా నిధులు, నియామకాలు,రాజకీయ ప్రాధాన్యతకు నోచుకోలేకపోయామన్నారు. ఇన్నాళ్లు రాజకీయ పార్టీలు తమ స్వార్థరాజకీయ ప్రయోజనాలకోసం బిసి కులాలను విడదీసి పబ్బంగడుపుకున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక నుంచి నుండి తమ అందరి కులం ఒకటేనన్నారు. వారన్నారు. త్వరలో రాయచోటి కేంద్రంగా బీసీ బహిరంగ సభను ఏర్పాటు చేసి మా సత్తా చాటుతామన్నారు. జెఎసి అధ్వర్యంలో అడహక్ కమిటీని ప్రకటించారు. ఇందులో సభ్యులుగా హెడ్ మాస్టర్ నాగేశ్వరరావు వాల్మీకి, శాలివాహన సంఘం ఉపాధ్యక్షులు సుధాకర్, మాజీ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గాండ్ల రెడ్డివరప్రసాద్, రజక సంఘం నాగరాజు, అడ్వకేట్ ఎకిల రామాంజ నేయులు, ఎకిల వీరాంజనేయులు, ప్రజానాట్య మండలి భాస్కర్ యాదవ్, వడ్డెర మేధావుల ఫోరం జీవానందం, రజక సంఘం అధ్యక్షుడు రమేష్,వడ్డెర సంఘం నాగరాజు, టీచర్ ఆంజనేయులు నాయీబ్రాహ్మణ సూరిబాబు, సంక్షేమ సంఘం ఆర్.రామచంద్ర పాల్గొన్నారు.



అభివాదం తెల్పుతున్న బిసి జెఎసి నాయకులు

సంపాదక శిల్పి 'ఎ.ఎస్.రామన్'

కడప అర్బన్ : 25 ఏళ్ల భారతీయ పత్రికా రంగంలో పాత్రికేయులుగా నిబద్ధతతో పనిచేసి, తన వ్యాసాలతో, సంపాదకీయాలతో, ఉపన్యాసాలతో జిల్లా కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేసిన సంపాదక శిల్పి ఎ.ఎస్.రామన్ అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఎ.ఎస్.రామన్ 105వ జయంతిని నిర్వహించారు. ముందుగా ఎ.ఎస్.రామన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. తర్వాత ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఎ.ఎస్.రామన్‌కు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మర్రి చెన్నారెడ్డి వంటి రాజకీయ ప్రముఖులతో మంచి పరిచయాలున్నాయని, వారితో చేసిన ఇంటర్వ్యూలు బాగా ప్రాచుర్యాన్ని పొందాయన్నారు. ఆయన పుస్తకాలన్నింటికీ భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ముందుమాట రాయడం విశేషమన్నారు. 1943లో సంపాదకునిగా ఆయన ప్రస్థానం ప్రారంభమైందని, అవర్ ఇండియా అనే మాసపత్రికను ఢిల్లీకేంద్రంగా సొంతంగా నడిపారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లా డుతూ అవధానం సీతారాముడు అనే తనపేరును ప్రసిద్ధ శాస్త్రవేత్త సి.వి.రామన్ ప్రభావంతో ఆయన ఎ.ఎస్.రామన్‌గా మార్చుకున్నారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, పాఠకులు పాల్గొన్నారు.

దేశ సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసి రెడ్డి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాలులో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, తాము అధికారం చేపట్టిన వెంటనే ప్రతి ఒక్క రైతుకూ రూ. ఆరు లక్షల రుణమాఫీ చేస్తామని, వంటగ్యాస్ రూ. 500లకే ఇస్తామని, పేద కుటుంబానికి ప్రతినెలా రూ. 6 వేలు ఇస్తాని చెప్పారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పట్టణ అధ్యక్షులు రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి, రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. ఇందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు .ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో కానీ, రాష్ట్రంలో గాని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో దేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు వేల్పుల శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలోనూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని అధికారం చేపట్టిందని, రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి మత విద్వేషాలను రెచ్చగొడుతుంటే, రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ పాలన సాగిస్తున్నారన్నారు. అన్నమయ్య జిల్లాలో కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తంబళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఎం.ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, ఒబిసి రాష్ట్ర కో–ఆర్డినేటర్ బి. సుబ్బరాయుడు, చిరంజీవి, డిసిసి ఒడిసి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

'మనం' సేవలను మరింత విస్తృతం చేస్తాం

ప్రజాశక్తి - రాయచోటి

మనం సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని మనం సంస్థ నూతన అధ్యక్షులు చింతం రెడ్డిభూషణ్ రెడ్డి అన్నారు.మనం సంస్థ ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహించారు. సంస్థ నూతన కమిటీ అధ్యక్షులుగా చింతం రెడ్డి భూషణ్ రెడ్డి ,ఉపాధ్యక్షులుగా దేవేంద్ర రెడ్డి, కార్యదర్శిగా గాజుల మహమ్మద్ అర్షద్, ఉప కార్యదర్శిగా రాపూరి ఆంజనేయులు, కోశాధికారిగా కొత్త రెడ్డయ్య శెట్టి,ఉప కోశాధికారిగా ప్రభాకర్ రెడ్డి, సభ్యులుగా మోడెం రవిశంకర్, మునిపల్లె గంగయ్య, షేక్ అబ్దుల్ రజాక్, కొత్త సురేంద్ర, మారం వెంకట్రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మనం సేవా సంస్థ ద్వారా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నడుస్తున్నాయన్నారు. భవిష్యత్తులో కూడా పూర్వ కమిటీ సభ్యులతో పాటు మిత్రులు, దాతల సహాయ, సహకారాలతో మనం సామాజిక సేవా సంస్థ ద్వారా మెరుగైన సేవా కార్యక్రమాలు అందిస్తామన్నారు.



ఎన్నికైన మనం సంస్థ నూతన కార్యవర్గం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిములు

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

ప్రజాశక్తి - రాయచోటి

పవిత్ర రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం మాసాపేటలో షాహి మున్వర్ మసీద్(పాత మసీద్)వాటర్ ట్యాంక్ వీధిలో మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు స్వయంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో సుమారు 2 వేల మంది పాల్గొని మైనారిటీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రసాద్ బాబు మాట్లాడుతూ పవిత్రమైన దివ్య ఖురాన్ అవతరించిన ఈ పవిత్ర రంజాన్ మాసంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఇస్లాం శాంతి, ప్రేమ ప్రేమ,దయాగుణాలను ప్రభోధిస్తుందని అన్నారు. రాయచోటి నియోజకవర్గ ప్రజలు ఐక్యమత్యంతో ఉంటూ మతసామరస్యాన్ని చాటాలని అన్నారు, మాజీ సర్పంచ్ దర్బార్ బాష, మలిగెల బాషా,షఫీ, అల్లబకష్, ఈనాయతుల్లా,సిద్దూ హుస్సేన్, ముత్తుకూరు రఫీ,జామాల్,సర్దార్,వేంపల్లి ఖాదర్ బాషా, చప్పలి షమీర్,బాబయ్య,ఖాదర్ వలీ,రజాక్, పీరు, మమ్మద్, మస్తాన్, సంచుల ఖాదర్ బాషా పలువురు ముస్లిములు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న షఫీ

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రంజాన్ తోఫాగా పేదలకు దుస్తులు పంపిణీ చేసినట్లు జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ, గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ జీనత్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రకాశం రోడ్డులోని షఫీ షామియానా సప్లయర్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో రూ.4.50 లక్షలు విలువచేసే దుస్తులను రంజాన్ తోఫాగా పేదలకు, గ్రామ పంచాయతీ కార్మికులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ మాసం సందర్భంగా తమ శక్తి కొద్దీ పేదలకు వస్త్ర, ఆహార వస్తువులను ఆనవాయితీగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఈసారి కూడా మహిళలకు చీరలు, పురుషులకు ఫ్యాంట్, షర్టు రంజాన్ తోఫాగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మిట్టమీద గిరి, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన

ప్రజాశక్తి-పెద్దమండ్యం

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్దమండ్యం మండల కేంద్రం లోని 32కెవి సబ్ స్టేషన్ ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలంలోని రైతులు, మాజీ జడ్‌పిటిసి, గ్రామ కమిటీ నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచులు, తెలుగు యువత, రైతు కమిటీ, ఇతర అనుబంధ కమిటీల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. **ములకలచెరువు :** రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంపుకు నిరసనగా నేడు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయనన మాట్లాడుతూ విద్యుత్, ఆర్‌టిసి చార్జీలు పెంపుతో సామాన్య ప్రజలపై ప్రభుత్వం పెను భారాన్ని మోపిందని అన్నారు. మండలంలోని రైతులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, తెలుగు యువత రైతు కమిటీలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న మల్లికార్జున నాయుడు

పొద్దుతిరుగుడు సాగుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-వీరబల్లి

మ్యాజిక్ ఎంహెచ్ఎస్ 915 పొద్దుతిరుగుడు విత్తనాల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మ్యాజిక్ కంపెనీ ఎండి మల్లికార్జున నాయుడు పేర్కొన్నారు. ఆదివారం విశ్వ ప్రసాద్ ఫర్టిలైజర్ ఆధ్వర్యంలో మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ బలిజపల్లె, రాచపల్లిలో సాగుచేసిన పొద్దుతిరుగుడు పంటను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇతర కంపెనీల కన్నా మ్యాజిక్ ఎంహెచ్ఎస్915 విత్తనాలు అధికంగా సాగు చేశారన్నారు. ఈ విత్తనం సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు వచ్చాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారని అన్నారు. ఈ సందర్భంగా రైతులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, మాజీ సర్పంచ్ కొల్లివెంకటరమణ నాయుడు, నాగార్జునరాజు, వెంకటేష్, ప్రసాద్‌రాజు, తాకేశ్వర్ రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మండలంలోని మూడు రోడ్ల కూడలిలో స్థానిక భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు రఫీ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ వేసవి కావడంతో దాహార్తి తీర్చడానికి తమ వంతుగా యూనియన్ సభ్యులు నిర్ణయం తీసుకొని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగత్ సింగ్ ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు షేక్ రఫీ,అధ్యక్షులు ఖాదరబాషా, మహబూబ్ బాషా,ఖాదర్, ఆటో,హరి కుట్టి, రవి, చాను, శంకర, జెండా సులేమాన్, పూల శ్రీనాథ్, టెంపర్ బాబాజాన్, ఖాసీం, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని చర్చీలలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక చర్చిలో పాస్టర్ నాగేంద్రుడు చర్చికి హజరైన వారికి సందేశం వినింపించారు.క్షమాగుణం, ప్రేమ, సాత్వికత్వం దీనత్వం యేసయ్య సొంతమని అన్నారు. ఈస్టర్ వేడుకలను మండలంలోని దేవుళచెరువు, పర్తికోట, సెంట్రల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. **ఓబులవారిపల్లి :** మండల పరిధిలోని కొత్త మంగంపేట అగ్రహారం ఆర్ఆర్ సెంటర్ వన్‌లో ఈస్టర్ పర్వదినం పురస్కరించుకొని రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రార్థనలలో ఏకీభవించారు. అనంతరం అసెంబ్లీ చర్చి లోనే కేక్ కట్ చేసి ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధి మాన్‌రాజు, ప్రవీణ్, జాను పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కలికిరి

అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని రిటైర్డ్ ఉపాధ్యాయుడు జయరాం, దళిత నాయకుడు సివి రమణల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులందరూ కలిసిమెలిసి ఐక్యమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. అంతేకాకుండా బడుగు బలహీన వర్గాల వారు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం కలికిరి మండల అంబేద్కర్ యువజన నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా శ్రీనివాస్‌వర్మ, డి.శ్రీనివాసులు, మల్లయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్ , ఉప కార్యదర్శిగా మోహన్ కుమార్, కార్యదర్శి ఎం.రాజా, కోశాధికారులు ఏ రామకృష్ణ, జి వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు వేణుగోపాల్, ఎం వెంకటరమణ, గౌరవ సలహాదారులు అగస్తీస్వర్, బి అశోక్ కుమార్, కెవి రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ అధ్యక్షులు బి.రవీంద్ర, కార్యదర్శి సిద్దయ్య, జివి.రమణ, శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, గంగప్ప, శివశంకర్, రాజ్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైసిపిలో 40 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని గండబోయనపల్లి పంచాయతీ మేకలవారిపల్లికి చెందిన 40 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఆదివారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పిఎ ఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో మేకలవారిపల్లికి చెందిన నల్లంకి కదిరప్ప, కుమార్, సత్య, రవి, మధు, శేఖర్, బాలక్రిష్ణ, మునెప్ప, నాగరాజ, శీనా, మల్లికార్జున, హరినాథ తదితరులు వైసిపిలో చేరారు. వీరిని ఎమ్మెల్యే చింతల వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజారంజక పాలన చూసే వైసిపి చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి అరుణమ్మ, సర్పంచ్ గుర్రప్ప, నాయకులు శ్రీనాథ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, నల్లంకి నరసింహులు, రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, శీనా, చెంగల్ రెడ్డి, ఆనంద, నీళ్లభాస్కర్, రాయుడు, రాజన్న, ఫారుఖ్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతమొందించాలి : ఆర్‌ఆర్

ప్రజాశక్తి-రామాపురం

అవినీతి వైసిపి పాలనను అంతమొందించాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీలోని వెంకటరెడ్డిగారిపల్లి, హరిజనవాడ, భైనేని హరిజనవాడ, చిట్లూరు పంచాయతీలోని చిట్లూరు కస్బా, మాలపల్లి, రాఘవరెడ్డిగారిపల్లి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రతి గ్రామంలో ప్రజలు మహిళలు పూల మాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అవినీతి అరాచకాలు గురించి ఆయన ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రాబోవు 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాలని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాని ప్రజలను కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర వనరులు ఇసుక మాఫియా, భూకబ్జాలు వైసిపి నాయకులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎం.రమేష్‌రెడ్డి, గాజులఖాదరబాషా, నరేంద్రకుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి. రాంబసిరెడ్డి, వెంకట్రామిరెడ్డి. రామకృష్ణ గౌడ్ పాల్గొన్నారు. **వీరబల్లి :** రాష్ట్రానికి పట్టిన శని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్ రాయుడు పేర్కొన్నారు. మట్లి ఎల్లంపల్లిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. జగన్ పాలనలో దాచుకో..దోచుకో అనే సామెత లాగా ఉంది కానీ ఏమాత్రం అభివృద్ధి చేసిన సంఘటన ఎక్కడ కనిపించలేదని



బండపల్లెలో ఇదేం ఖర్మ కార్యక్రమంలో రమేష్‌కుమార్‌రెడ్డి

అన్నారు. ఏ రంగంలో ముందుకు వెళ్లారో సిఎం జగన్ చెప్పాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో చాలా మంది నిధులు లేక ఖాళీగా ఉన్నారన్నారు. కేవలం బటన్ నొక్కుడు తప్ప ఏ గ్రామంలో కూడా కనుచూపుమేరకు అభివృద్ధి చేసిన దాఖలాలే లేవన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు గతంలో రంజాన్ తోఫా ఇచ్చి పేద ముస్లింలు ఆదుకునే వారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సాధికార కమిటి కార్యదర్శి గుట్ట బాబు,, టిడిపి మండల శాఖ అధ్యక్షులు భానుగోపాల్ రాజు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి వెంకటరమణ నాయుడు, మాజీసర్పంచ్ రవినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రాయ వెంకటేష్ నాయుడు, అసెంబ్లీ వాణిజ్య విభాగ కార్యదర్శి పవన్, గుదే నాగార్జున నాయుడు, సురేష్ కుమార్, నాగార్జున నాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు కాంతమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సిఎం ధ్యేయం : ఎంపిపి



కలకడ : గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ కూచివారిపల్లి, బాటవారిపల్లె గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలను సిఎం జగన్ అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రవికుమార్, రెడ్డప్ప, సచివాలయం కన్వీనర్ నాగరాజ, ఉదయ్ భాస్కర్, సునీత, వాలంటీర్స్ పాల్గొన్నారు. **నందలూరు:** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నల్ల తిమ్మయ్యగారిపల్లి గ్రామపంచాయతీ లో మా నమ్మకం నువ్వే జగన్..జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు దారుడు చంద్రబాబు నాయుడు పరిపాలనను ప్రజలు రాబోయే కాలంలో కోరుకోవడం లేదన్నారు. మరల జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వక్స్ బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ భువనబోయిన లక్ష్మీనరసయ్య, వైసిపి నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, పాలగిరి మల్లికార్జునరెడ్డి, సుబ్బారెడ్డి, తుమ్మల శ్రీధర్, నడివీధి సుధాకర్, సచివాలయ జెసిఎస్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** పార్టీలు చూడకుండా, కులాలు, మతాలు చూడకుండా పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనే మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు వాల్మీకిపురం ఉపసర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీమ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని నాయకవీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, గృహసారథులు ఇంటింటా వెళ్లి గత టిడిపి ప్రభుత్వ పాలనలో అమలు కాని ఎన్నికల హామీలు, వైసిపి పాలనలో అమలు చేసిన హామీలను గురించి ప్రజలకు వివరించి సర్వే నిర్వహించారు. ఇళ్ల వద్ద సిఎం జగన్మోహన్ రెడ్డి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, నాయకులు సైపుల్లా, చికెన్ మస్తాన్, సాధిక్, షాహిద్, జవహర్, రహంతుల్లా, సమీ, ఇమ్రాన్, మజీద్, రమేష్, రమణ పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకమే జగనన్నే కార్యక్రమాన్ని మండల కో–ఆప్షన్ సభ్యులు జమాల్ భాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలలోకి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బిసి నాయకులు రామ్మూర్తి, ఎంపిటిసి కరీం, జ్యోతి, వాలంటీర్ జిలానీ పాల్గొన్నారు.

'వీర జవాన్లకు ఘన నివాళులు'

ప్రజాశక్తి-కలికిరి

శౌర్య దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం కలికిరి సిఆర్‌పిఎఫ్ సిఐఎటి స్కూల్‌లో కమాండెంట్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో వీర జవాన్ల సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1962వ సంవత్సరంలో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అనేకమంది జవాన్లు వీర మరణం పొందారని వారి సేవలు దేశం ఎప్పుడు గుర్తుంచుకుంటుందని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని జవాన్లందరూ దేశభక్తి చాటుకోవాలని కోరారు. అనంతరం సిఆర్‌పిఎఫ్ ఏర్పాటు, ఆవశ్యకత, దేశానికి చేసిన సేవలు గురించి జవాన్లకు వివరించారు. వీర జవాన్లకు జ్ఞాపకార్థం నూతన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండర్లు ఎకెసింగ్, నిషాముల్, కథమ్ సింగ్, ఎస్‌పి నందన్వర్, రవికుమార్, అసిస్టెంట్ కమాండర్లు గిరిధర్ జవాన్లు పాల్గొన్నారు.



జెండాను నావిష్కరిస్తున్న కమాండర్ రాజేష్ కుమార్



ఇఫ్తార్ విందులో టిడిపి నాయకులు

ఇఫ్తార్ విందులో టిడిపి నేతలు

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని ఇంటర్నేషనల్ ఫంక్షన్ ప్యాలెస్‌లో పవిత్రమైన రంజాన్ మాసంను పురస్కరించుకుని జమీల్ మొబైల్స్ అధినేత షేక్. ముస్తాక్, షేక్.జమీల్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి యువ నాయకులు పుత్తా చైతన్యరెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, కె.ఎస్. బర్కతుల్లా, టిడిపి కడప నియోజకవర్గ ఇన్చార్జ్ వి.ఎస్.అమీర్ బాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి హరి ప్రసాద్, నాయకులు సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతిగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



కండక్టర్‌ను సన్మానిస్తున్న గిరినగర్ యువత

నిజాయితీ చాటుకున్న ఆర్‌టిసి కండక్టర్

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

బద్వేలు ఆర్‌టిసి డిపోకి చెందిన కండక్టర్ బొజ్జా మధుసూదన్ విధులు నిర్వహిస్తున్న సందర్భంగా బస్సు లో రూ.1.80 లక్షలు దొరకడంతో ఆర్‌టిసి డిపో మేనేజర్ సమక్షంలో బద్వేలు సిఐకి నగదును అప్పగించారు. కండక్టర్ మధు నిజాయితీ పట్ల సిఐ అభినందనలు తెలిపారు. విషయం తెలియడంతో పోరుమామిళ్ల గిరినగర్ కు చెందిన యువకులు ఆధ్వర్యంలో కండక్టర్ మధు సూదన్‌ను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లెక్చరర్ పొట్టిపోగు జాన్సన్, మనోజ్ సాగర్, ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్, బొజ్జ ప్రతిప్, పొట్టి పోగు విజయ్, సగిలి వినీత్, పి.రాజేష్, పి.వినయ్, బి.బన్నీ, గిరినగర్ యువత పాల్గొన్నారు.

ఐటిడిపి ప్రధాన కార్యదర్శి మృతి బాధాకరం

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప పార్లమెంట్ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి నరసింహ ఆకస్మిక మృతి బాధాకరమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. తెలుగుదేశంపార్టీకి పార్లమెంట్ పరిధిలో నరసింహ విశేష సేవలు చేసారని పేర్కొన్నారు.

సినీనటి కరాటే కల్యాణికి సన్మానం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

సినీనటి, యాదవ సంఘం జాతీయ హక్కుల అధ్యక్షురాలు, మా అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కరాటే కళ్యాణిని పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ యన మల సుధాకర్ నాయుడు దంపతులు ఘనంగా సన్మానించారు. కరాటే కళ్యాణి మండలంలోని అక్కంపేటలో వెలిసిన విభూతి శివలింగం ఆలయంలో శనివారం రాత్రి హరికథ గానం చేసి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో పోరుమామిళ్లలో సర్పంచ్ సుధాకర్ నాయుడు ఆహ్వానం మేరకు విచ్చేశారు.ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ సాంప్రదాయ కళలైన హరికథ అంతరించి పోతుందన్నారు. జీవం పోసి కలకాలం ఉండాలని విజయనగరం జిల్లాలోని గంజేరు గ్రామం దగ్గర గోశాలతోపాటు హరికథ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఆవరణలో 108 అడుగుల కృష్ణుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తన తండ్రి హరికథ గానం చేయడంలో సుప్రసిద్ధుడని ఆయన కోరిక మేరకు ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అందరికి సహకారంతో దాతల సహాయంతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి పరుస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ షరీఫ్, అతిగారి రాజా పాల్గొన్నారు.

15న విశ్వవిద్యాలయంలో ఏకపాత్రాభినయం

ప్రజాశక్తి కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య జింక రంగ జనార్దన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, మార్గదర్శకత్వంలో ఈనెల 15న ఏకపాత్రాభినయం నాటికలు ప్రదర్శిస్తారని లలితకళల విభాగం సమన్వయకర్త డాక్టర్ కోట మృత్యుంజయరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవ సందర్భంగా వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో రంగస్థల కళల విద్యార్థులచే ఏకపాత్రాభినయాలు, పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచించిన 'సైరానరసింహారెడ్డి' నాటకం ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

12న తాళ భజన పోటీలు

జమ్మలమడుగు : జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఈనెల 12న రాత్రి 8 గంటలకు తాళ భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈశ్వరస్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి కమిటీ సభ్యులు తెలిపారు. ఈశ్వరస్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ట 41 రోజు పురస్కరించుకొని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన తాళ భజన పోటీలు నిర్వహి స్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం పోటీలు ఉంటాయని తెలిపారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు లాటరీ ద్వారా పోటీలు నిర్వహిస్తామన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న రౌఫ్‌బాషా

'వైరస్‌తో అప్రమత్తంగా ఉండాలి'

ప్రజాశక్తి-నందలూరు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం నందలూరు జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం రౌఫ్‌బాషా ఆధ్వర్యంలో పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జెవివి ముద్రించిన జాగ్రత్తలు తీసుకుందాం..ఆరోగ్యంగా ఉందాం అనే కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో కరోనా తరహాలో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా అనే వైరస్ వ్యాప్తి చెందుతుందని అన్నారు. శనివారం ఒక్కరోజే దేశమంతా ఆరువేల మందికి ఈ వైరస్ సోకిందని అన్నారు. కరోనా తరహాలో ఇటువంటి వైరస్ లక్షణాలు కనిపించిన వెంటనే తగు జాగ్రత్తలు తీసుకుంటే వైరస్‌వ్యాప్తిని అరికట్టవచ్చు అని పేర్కొ న్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్ రెడ్డి, సరోజిని దేవి, కొండమూర్తి, పుణ్యవతి, చక్రపాణి, వరప్రసాద్, రాగసుధ, రామకృష్ణ, సురేష్ బాబు, శివయ్య, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన లోకాయుక్త జస్టిస్ పర్యటన

ప్రజాశక్తి-ములకలచెరువు

మూడు రోజుల పర్యటన నిమిత్తం పిటియం మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయుని పల్లెకు వచ్చిన లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి పర్యటన ఆదివారం ముగిసింది. స్థానిక ఎస్ఐ మధురామచంద్రుడు లోకాయుక్త డిఎస్‌పి కోలార్ క్రిష్ణ , ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డిలు వీడ్కోలు పలికారు. రోడ్డు మార్గం ద్వారా కర్నూలుకు చేరుకుంటారని అధికారులు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-పుల్లంపేట

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని పుల్లంపేట, పుత్తనవారిపల్లి, గ్రామలలో గ్రామస్తుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు నడుమ మంత్రోచ్ఛరణలు మధ్య కమనీయం రమణీయంగా నిర్వహించారు. కళ్యాణ వేదికను పూలతో సుందరంగా అలంకరించి సీతారామ లక్ష్మణ హనుమంతు ఉత్సవ విగ్రహాలను కొలువు తీర్చి కళ్యాణ తంతును కమనీయంగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు జారవిడిచారు. కళ్యాణం అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

మారమ్మకు వార్షిక పొంగళ్లు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రమైన పుల్లంపేట బస్టాండ్ సమీపంలో వెలసి ఉన్న మారమ్మకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా వార్షిక పొంగళ్లు నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు నిర్వహించి అనంతరం మారమ్మకు నైవేద్యం సమర్పించి కోర్కెలు తీర్చుకున్నారు. నమ్మిన దైవం కోరిన కోర్కెలు ఆపద సమయంలో కాపాడే ఇష్టదైవం మారమ్మ అని గ్రామస్తులు విశ్వాసం వ్యక్తం చేశారు.



టీం సభ్యులతో మాట్లాడుతున్న ద్వారకనాథరెడ్డి

వైసిపిని బలోపేతం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

నియోజకవర్గంలో వైసిపిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేద్దామని టీం ద్వారకనాథరెడ్డి సభ్యులు స్పష్టం చేసినట్లు వైసిపి మండల సోషల్ మీడియా కన్వీనర్ పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో టీమ్ ద్వారకనాథ్ రెడ్డి సభ్యులు సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణ, ప్రణాళికను ఎలా చేయాలి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలా ప్రజలకు చేరవేయాలి, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు వివరించడం, విమర్శలు చేసే వారికి ఆధారాలతో సహా ఎలా తిప్పి కొట్టాలి అనే అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తంబళ్లపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతంగా ముందుకు తీసుకపోతామని అన్నారు.



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మనోరెడ్డి

పేదలకు బియ్యం అందజేత

ప్రజాశక్తి-పీలేరు

పేదలకు బియ్యం పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఈస్టర్ డే ను పురస్కరించుకుని పీలేరుకు చెందిన మనోరెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మనోరెడ్డి తన తల్లిదండ్రులైన విశ్రాంత ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, హెలెన్ కుమారిల జ్ఞాపకార్థం వెయ్యి మంది పేదలకు బియ్యం పంపిణీ చేయడమనేది అభినందనీయం అన్నారు. మనో రెడ్డి, అతని సోదరుడు ఈ కార్యక్రమాన్ని గత 15 ఏళ్లుగా నిర్వహిస్తుండడం విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఎటి.రత్న శేఖర్ రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ కడప గిరిధర్ రెడ్డి, మహబూబ్ బాష పాల్గొన్నారు.

మానవతామూర్తి హకీం మంజుమియా

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరానికి చెందిన మొన్నటితరం ప్రముఖుడు, గొప్పవైద్యుడు హకీం మంజుమియా మానవతా మూర్తిగా కీర్తి గడించారని యోగి వేమన విశ్వ విద్యాలయం చిత్రలేఖన విభాగం అధిపతి డాక్టర్ కోటా మృత్యుంజయరావు అన్నారు. హకీం మంజుమియా వర్ధంతి సందర్భంగా ఆదివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మృత్యుంజయరావు మాట్లాడుతూ హకీంగా ఆయన జిల్లా వాసులకు అప్పట్లో అనితర సాధ్యమైన సేవలను అందించారని పేర్కొన్నారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ హకీం మంజుమియా ధాతృత్వానికి చిహ్నంగా నేటికీ కడప నగరంలో పలు గుర్తులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రచయిత కె.వి. రమణారెడ్డి, రాయలసీమ టూరిజం కల్చరల్‌సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్ , పర్యాటక ఫొటోగ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వరరావు, రేడియో వ్యాఖ్యాత గంగాధర్, డేవిడ్, విజయ్, సతీష్ పాల్గొన్నారు.

www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 ఏప్రిల్ 2023
5



వైఎస్ఆర్

10 నుంచి స్థానిక సమస్యలపై పర్యటనలు

కడప అర్బన్ : నగరంలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి విస్తృతంగా పర్యటనలు చేపడుతున్నట్లు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు తెలిపారు. ఆదివారం పాత బస్టాండ్ లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభంలోనే నీటి కష్టాలు తీవ్రస్థాయిలో ఉన్నాయన్నారు. ఇప్పటికే అక్కాయిపల్లి, సాయి పేట, మురాందిన్ వీధి, ఖలీల్ నగర్ ప్రాంతాల్లో వారం, పది రోజులైనా నీళ్లు వచ్చే పరిస్థితి లేదన్నారు. రామకృష్ణ నగర్, సుందరయ్య నగర్, వైఎస్ఆర్ కాలనీ, మృత్యుంజయ కుంట ప్రాంతాలలో రోడ్లు, మౌలిక వసతుల సమస్యలు చాలా తీవ్రంగా ఉందని తెలిపారు. చెత్త, ఆస్తి పన్ను, నీటి మీటర్లకు వ్యతిరేకంగా డివైఎఫ్ఐ పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలకు ప్రజలు ప్రత్యక్ష భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

చర్చించేనా !


కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ప్రజల సమస్యలపై సమగ్రంగా చర్చించడంపై సందేహం నెలకొంది. గత సర్వసభ్య సమావేశం కౌన్సిలర్ల టూర్ నేపథ్యంలో మొక్కుబడిగా ముగిసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సభలో ప్రజల సమస్యల ప్రస్తావనకు ఆస్కారం లేకుండా పోయింది. కార్పొరేషన్ ఎన్నికలలో 50 కౌన్సిల్ స్థానాల్లో 49 స్థానాలను అధికార వైసిపి కైవసం చేసుకుంది. మిగిలిన 49వ డివిజన్‌లో మాత్రమే టిడిపి అభ్యర్థి గెలుపొందిన నేపథ్యంలో అధికార పార్టీని నిలదీసే పరిస్థితి లేకుండా పోయింది. ఒకవేళ ప్రజల సమస్యలపై నిలదీసే ప్రయత్నం చేసినా ఆలకించే నాధుడు ఉండని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో అధి కార పార్టీ కౌన్సిలర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిన నేపథ్యంపై కథనం...

సా..గుతున్న రహదారుల విస్తరణ
తాగునీటి సమస్యకు పరిష్కారమేది?
తడి, పొడి చెత్త సేకరణలో అలక్ష్యం
నేడు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప కార్పొరేషన్ సమస్యలకు కేరాఫ్ అడ్రెస్‌గా నిలిచింది. కమిషనర్ క్రియాశీలత కారణంగా పన్ను వసూళ్లు, పనుల పురోగతి ఆశావహంగా కనిపిస్తోంది. రాష్ట్రంలోని వైజాగ్, రాజమండ్రి కార్పొరేషన్ల తరహాలో కార్పొరేషన్‌ను అభివృద్ధి పరచాలనే కమిషనర్ ప్రయత్నాలు నిధుల కొరత కారణంగా కొలిక్కి రావడం లేదు. కార్పొరేషన్‌లో దశాబ్దాల తరబడి మురిగిపోయిన సమస్యల కారణంగా ఇప్పట్లో సమస్యల నుంచి తేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ ఆధునీకరణ, వర్షాకాలంలో ముంపు ప్రాంతాల పరిరక్షణ, ఫ్లడ్ కెనాల్స్ ఏర్పాటు, రహదారుల విస్తరణ, చెత్త సేకరణ, తాగు నీటి వంటి పలు సమస్యలు అడుగు ముందుకు పడనీయని పరిస్థితి నెలకొంది. వైసిపి పాలకవర్గం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల వ్యవధిలో రూ.350 కోట్లతో చేపట్టిన నాలుగు రహదారుల్లో ఒక్క రహదారి విస్తరణ పనుల్ని పూర్తి చేసిన దాఖలా ల్లేవు. మాసాపేట బస్టాండు మీదుగా శ్రీనివాస కళాశాల వరకు బైపాస్‌రోడ్డు పురోగతి కనిపించడం మినహా మిగిలిన వాటిలో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. కృష్ణా సర్కిల్ నుంచి మాచుపల్లి బస్టాండు దేవుని కడప వైపునకు వెళ్తే రహదారి, వైజంక్షన్‌లో కొంత మేర విస్తరణ పనులు సా..గుతూనే ఉండడం మినహా మిగిలిన రహదారి విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రతియేటా వర్షాకాలంలో కార్పొరేషన్‌లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్న సంగతి తెలిసిందే. ఈనే పథ్యంలో 2021 జులై తొమ్మిదిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లా పర్యటనలో భాగంగా సుమారు రూ.150 కోట్లతో నాలుగు హెవీ ఫ్లడ్ కెనాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించిన సంగతి తెలి సిందే. తాత్కాలిక ప్రాతిపదికన జెసిబిలతో మట్టి తీసి వది లేయడం మినహా ఎటువంటి పురోగతి కనిపిం చడం లేదు. కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలోనూ తాగునీటి సమస్య కొనసాగుతూనే ఉంది. రెండు, మూడ్రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తుండడం ఆందోళన కలి గిస్తోంది. ఇటీవల బడ్జెట్ సమావేశంలో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. దశాబ్దాల కింద రూపకల్పన చేసిన తాగు నీటి పథకాల కారణంగా పెరుగుతున్న పట్టణ అవసరాలకు నీటి కొరత ఏర్పడుతోంది. ఈనేపథ్యంలో మూడేళ్ల కిందట రూ.40 కోట్ల అమృత్ స్కీమ్ కింద తాగునీటి సరఫరా పనులు చేపడుతున్నప్పటికీ ఆశిం చిన ఫలితాలను ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఇదిలాఉండగా శాని టేషన్ పనుల పురోగతిలో ఆశావహ పరిస్థితి కనిపించడం లేదు. కార్పొరేషన్‌లో 100 చెత్త సేకరణ వాహనాల ద్వారా తడి, పొడి చెత్త ను సేకరించాల్సి ఉంది. కానీ ఆచరణలో 90 వాహనాల్లో మాత్రమే చెత్త సేకరణ ప్రక్రియ సాగుతున్నట్లు సమాచారం. నగర శివారు ప్రాంతాల్లో రెండు, మూడ్రోజులకు ఒకసారి చెత్త సేకరణ ప్రక్రియ సాగుతోందనే విమర్శలు ఉన్నాయి. కడప నడిబొడ్డున ఉన్న రాజీవ్ పార్క్ రహదారి సాగుతూనే ఉంది. నిధుల విడుదల చేయని కార ణంగా కాంట్రాక్టర్ ముందు వెనుకా ఆలోచిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కార్పొరేషన్ పరిధిలో సుమారు 82 వేల నుంచి లక్ష ఇళ్ల నుం చి చెత్త పన్ను సేకరణలో మాత్రమే ముందంజలో ఉన్నారనే విమర్శ వినిపిస్తోంది. కార్పొరేషన్‌లో ఆస్తి పన్ను మొదలుకుని చెత్తపన్ను వర కు గుంపులుగా వెళ్లి దబాయించి సేకరిస్తున్న నేపథ్యంలో ఆమేరకు సదుపాయాలన ందించాల్సిన స్పృహను కోల్పోవడంపై విస్మయా న్ని కలిగిస్తోంది. ఇటీవలి బడ్జెట్ సమావేశంలో ఆస్తిపన్నులో చెత్తప న్ను కలిపి వసూలు చేయనున్నారనే చర్చకు రావడం ఆందోళన కలి గిస్తోంది. ఇంటి పన్ను చెత్త పన్ను వసూలు చేస్తే ఇళ్లఅద్దెలు పెరిగి పోయే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



వైభవంగా శ్రీ కోదండరాముడి

పుష్పయాగం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం సాయంత్రం పుష్పయాగం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన పుష్పయాగం రాత్రి 9 గంటలకు ముగిసింది. ఇందులో తులసీదళాలు, మల్లెలు, రోజా, చామంతి, గన్నేరు, నూరువరహాలు, మొగలి తదితర 11 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దాతలు 2.5 టన్నుల పుష్పాలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్



పోటీలు ప్రారంభిస్తున్న మన్మోహన్‌రెడ్డి

నగరంలోని అలంకాన్‌పల్లెలో శ్రీశ్రీశ్రీ మారెమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం బండలాడుగు పోటీలు ఘనంగా నిర్వహించారు. టిడిపి యువ నాయకులు జి మన్మోహన్ రెడ్డి, జి. రఘునాథరెడ్డి రెడ్డి, చర్ల జయరామిరెడ్డి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరిని చల్లగా చూడాలని కోరారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వృషభాలచే న్యూ క్యాటగిరి బండలాగుడు పోట్లో జిల్లా నలుమూలల నుంచి 13 జతల వృషభరాజులు హాజరయ్యాయి. పోటీలను మన్మోహన్ రెడ్డి తోపాటుగా గ్రామ యువ నాయకులు లేవాకు ముని కుమార్ రెడ్డి, బ్రహ్మయ్య, మధు వర్ధన్ రెడ్డి ప్రారంభించారు.

ప్రతి ఒక్కరూ తప్పక వ్యాయామం చేయాలి : జెసి

ప్రజాశక్తి - కడప



భవనాన్ని ప్రారంభిస్తున్న జెసి సాయికాంత్‌వర్మ

ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య రీత్యా కొంత మేరకైనా వ్యాయామం చేయాలని, ఆరోగ్యమే మహా భాగ్యమని, క్రీడలు శారీరక, మానసికంగా ఎంతగానో దోహ దపడతాయని జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ అన్నారు. ఆఫీసర్ క్లబ్‌లో ఆధునీకరించి ప్రధాన భవనాన్ని జాయింట్ కలెక్టర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 70 ఏళ్లుగా కడప ఆఫీసర్స్ క్లబ్‌లో వివిధ రకాలైన క్రీడల వ్యాయామ పరికరాల ద్వారా జిమ్, షటిల్, ఈత, టెన్నిస్, క్యారమ్స్ లాంటి క్రీడలకు ప్రోత్సాహం అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు అందరూ క్లబ్‌లో అందుబాటులో ఉన్న క్రీడలన్నింటిని వినియోగించుకొని శారీరకంగా, మానసికంగా బలంగా ఉండాలని సూచించారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులందరూ క్లబ్‌లో సభ్యత్వాన్ని తప్పక తీసుకొని వినియోగించుకోవాలని చెప్పారు. వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు టెన్నిస్, షటిల్, ఈత శిక్షణ కార్యక్రమాలు త్వరలోనే నైపుణ్యం గల శిక్షకుల ద్వారా శిక్షణకు తగు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకొని పిల్లలకు శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా. కడప ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ పి. యదుభూషణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి బ్రహ్మయ్య, కోశాధికారి జి.కె. వీరభద్రయ్య, కార్యవర్గ సభ్యులు మధుసూదనరెడ్డి, జానుమద్ది విజయభాస్కర్, సుదర్శన బాబు రెడ్డి, డాక్టర్ వెంకట సుబ్బయ్య, సుబ్బరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు జెసిని, ట్రైనీ కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

సంపాదక శిల్పి 'ఏ.ఎస్.రామన్'

కడప అర్బన్ : 25 ఏళ్ల భారతీయ పత్రికా రంగంలో పాత్రికేయులుగా నిబద్ధతతో పనిచేసి, తన వ్యాసాలతో, సంపాదకీయాలతో, ఉపన్యాసాలతో జిల్లా కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేసిన సంపాదక శిల్పి ఎ.ఎస్.రామన్ అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఎ.ఎస్.రామన్ 105వ జయంతిని నిర్వహించారు. ముందుగా ఎ.ఎస్.రామన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. తర్వాత ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఎ.ఎస్.రామన్‌కు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మర్రి చెన్నారెడ్డి వంటి రాజకీయ ప్రముఖులతో మంచి పరిచయాలున్నాయని, వారితో చేసిన ఇంటర్వ్యూలు బాగా ప్రాచుర్యాన్ని పొందాయన్నారు. ఆయన పుస్తకాలన్నింటికీ భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ముందుమాట రాయడం విశేషమన్నారు. 1943లో సంపాదకునిగా ఆయన ప్రస్థానం ప్రారంభమైందని, అవర్ ఇండియా అనే మాసపత్రికను ఢల్లీకేంద్రంగా సొంతంగా నడిపారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ అవధానం సీతారాముడు అనే తనపేరును ప్రసిద్ధ శాస్త్రవేత్త సి.వి.రామన్ ప్రభావంతో ఆయన ఎ.ఎస్.రామన్‌గా మార్చుకున్నారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, పాఠకులు యు.రాజేష్ కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు అందజేత

కడప అర్బన్ : నగరంలోని కృష్ణా సర్కిల్ దగ్గర ఉన్న అర్రహ్మాన్ ఇందాద్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా సయ్యద్ జాఫర్ హుస్సేన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సుహేల్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు షేక్. మహబూబ్ బాషా మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని దాదాపు 500 మందికి 15 రకాల నిత్యవసర సరుకులతో పాటు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసిన సయ్యద్ జాఫర్ హుస్సేన్ దాతృత్వం చాటుకోవడం ప్రశంసనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు కూడా పంపిణీ చేశారు.

పండగ పూట విషాదం

సరదా కోసం ఈతకు వెళ్లి ముగ్గురు మృత్యువాత
మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఒక యువకుడు
అలవలపాడులో విషాద ఛాయలు

ఈస్టర్ పండగ రోజు ఆనందంగా గడపాల్సిన వారు సరదా కోసం ఈత కెళ్లి మృతువాత పడ్డారు. ఈ సంఘటన వేంపల్లె మండలంలోని అలవలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు..



మృతులు అక్కా తమ్ముడు సాయితేజశ్రీ, సుశాంత్, యువకుడు జానయ్య

ప్రజాశక్తి-వేంపల్లె



చిన్నారుల మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

మండలంలోని అలవలపాడు ఎస్‌సి కాలనీకి చెందిన అక్కా తమ్ముడు సుశాంత్ (10), సాయి తేజశ్రీ (11), వారి మేనమామ శశికుమార్‌తోపాటు వేముల మండలం వేల్పుల గ్రామానికి చెందిన జానయ్య (25) కలిసి ఆదివారం ఈస్టర్ పండగ సందర్భంగా సరదాగా గ్రామ సమీపంలోని జిఎన్ఎస్ఎస్ పంట కాల్వల వద్దకు ఈత కోసం వెళ్లారు. మొదటగా ఇద్దరు చిన్నారులు కాలువలోకి దిగారు. కాల్వలో బురద మట్టి ఎక్కువగా ఉండడంతో వారు అందులో ఇరుక్కుపోయారు. జానయ్య అనే యువకుడు ఇద్దరు చిన్నారులను కాపాడే ప్రయత్నంలో అతనూ అందులో చిక్కుకుని పోయాడు. వారి ముగ్గురి ఆచూకీ కోసం చిన్నారుల మేనమామ శశికుమార్ వెతికాడు. వారు కన్పించకపోవడంతో వెనుదిరిగి గట్టుపైకి వచ్చాడు. కాలువ సమీపంలో పనిచేస్తున్న కొందరు వ్యక్తులతో పాటు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బాలస్వామిరెడ్డి సభ్యులు కాల్వలోకి దిగి బురదలో చిక్కుకున్న ముగ్గురిని బయటకు తీశారు. అప్పటికే ముగ్గురు మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తిరుపాల్‌నాయక్ పేర్కొన్నారు.

ఏడాది కిందటే రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

చిన్నారుల తల్లిదండ్రులు రూతు, సురేష్‌కుమార్. వారిది చక్రాయపేట మండలం చిలేకాంపల్లె. ఏడాది కిందట తల్లి రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. దీంతో వారు వేంపల్లె మండలంలోని అలవలపాడులో తమ అవ్వా, తాతల వద్ద ఉంటూ నారాయణ పాఠశాలలో 5,6 తరగతులు చదువుకుంటున్నారు. చిన్నారుల తండ్రి ఎర్రగుంట్ల డాబాలో వంట మాస్టర్‌గా పని చేస్తూ పిల్లల్ని చదివించుకుంటున్నాడు. ఈస్టర్ పండగ కావడంతో బంధువులతో కలిసి గ్రామ సమీపంలోని ఎస్‌సి కాలనీలో సంతోషంగా పండుగ జరుపుకున్నారు. మేనమామ శశికుమార్‌తో కలిసి ఇద్దరు చిన్నారులు, సమీప బంధువైన వేంపల్లె మండలానికి చెందిన జానయ్య కూడా కాలువ వద్దకు ఈత కోసం వెళ్లి మృతువాత పడ్డారు.

పెళ్లైన ఆరు నెలలకే..

ఇదీలా ఉండగా జానయ్య పులివెందులలో మెకానిక్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఆరు నెలల కిందటే వీరపునాయనపల్లె మండలం పాలగిరికి చెందిన శృతి అనే అమ్మాయితో వివాహమైంది. ఇద్దరు చిన్నారులను కాపాడబోయే మృత్యువాత పడడంతో అతని కుటుంబంలోనూ తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లైన ఆరు నెలలకే జానయ్య మృతి చెందడంతో బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా మృతుడి తండ్రి గత డిసెంబర్‌లో విద్యుదాఘాతంతో మృతిచెందాడు.

శోకసంద్రంలో బంధువులు

పండుగ రోజు ముగ్గురు నీటిలో పడి చనిపోవడంతో అలవలపాడు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. మృతదేహాలను చూసేందుకు వచ్చిన బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏడాది కిందట భార్యను, ఇప్పుడు పిల్లలిద్దరిని కోల్పోవడంతో సురేష్‌కుమార్ బాధకు అంతు లేకుండా పోయింది. మరో వైపు వివాహమైన ఆరు నెలలకే భర్తను కోల్పోయిన జానయ్య సతీమణి శృతి కన్నీరు మున్నీరుగా విలపించింది. దీంతో ఇరు కుటుంబాల బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు.

ప్రమాదవశాత్తు లోయలో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్



మృతుడు ఇస్మాయిల్

మండలంలోని గండికోట వద్దనున్న లోయలో ప్రమాదవశాత్తు కాలు జారీ పడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు.. విజయవాడ నుంచి ఇస్మాయిల్ (23) తన స్నేహితులు పవన్, సతీష్, కార్తీక్ కలిసి గండికోట చూడడానికి వచ్చారు. అక్కడి రోప్‌వేకు సమీపంలో ఉన్న కొలను వద్ద స్నేహితులతో కలసి ఇస్మాయిల్ ఈత కొట్టాడు. అనంతరం డ్రస్సు మార్చు కుంటూ ఉండగా ప్రమాద వశాత్తు పక్కనున్న లోయలో పడిపోయాడు. వెంటనే అతని స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ సదాశివయ్య, ఎస్ఐ సుబ్బారావు తమ సిబ్బంది సాయంతో ఇస్మా యిల్‌ను లోయనుంచి బయటకు తీశారు. అప్పటికే అతను చనిపోయాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు విజయవాడలో యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగి పనిచేస్తున్నాడు. మృతుడికి తల్లిదండ్రులు ఆశా, బాజీ, చెల్లి ఉన్నారు. తండ్రి విజయవాడలోనే కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు.

అచ్చెన్న హత్య కేసును సుమోటోగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

పశుసంవర్ధకశా డిడి అచ్చెన్న హత్యలో చాలా అనుమానాలున్నాయని, హైకోర్టు సుమోటోగా తీసుకుని విచారించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 8న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి అక్రమ అరెస్టును ఖండిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. మహ మహాత్మ జ్యోతిరావు పూలే 196 జయంతి సందర్భంగా పూలే విగ్రహాల ముందు ఈనెల 11న నిరసన జిల్లావ్యాప్తంగా తెలియజేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అదే రోజు 'రాష్ట్ర అఖిలపక్ష కమిటీ' ఆధ్వర్యంలో విజయవాడలో సిఎం క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర నాయకులు, బాధిత కుటుంబ సభ్యులను, జిల్లా అఖిలపక్ష ప్రతినిధులను వెంట తీసుకుని వెళ్లి, సిఎంను కలిసి అచ్చెన్న హత్యా ఉదాంతంపై వివరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, సీనియర్ నాయకులు వేణుగోపాల్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అలంకానపల్లె లక్ష్మీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.ఎ. సత్తార్, బి.ఎస్.పి జిల్లా ఇన్చార్జి అధ్యక్షులు సగిలిగుర్రప్ప, లోక్ సత్తా నాయకులు దేవర కృష్ణ , హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్ కడప నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి, ఎంఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సంఘాల ప్రతినిధులు, సి.పి.ఐ, సి.పి.ఎం, తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీ, బిఎస్‌పి, లోక్ సత్తా,ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సిట్టింగ్‌జడ్జితో విచారణ చేపట్టాలి : డివైఎఫ్ఐ

బద్వేలు : కడప పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్యపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అందుకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ డాక్టర్ అచ్చెన్న ఎంతో నిజాయితీపరుడని ఆయన హత్యపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు పొంగూరు నాగరాజు డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు గంగనపల్లి నాగార్జున, సిఐటియు నాయకులు రాజగోపాల్, కెవిపిఎస్ పట్టణ నాయకులు సగిలి గుర్రప్ప, ఎంప నరసింహ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డు ఎస్‌పి రాజకిషోర్‌బాబు వెల్లడి

ప్రజాశక్తి-కడప అర్బన్



ఇఫ్తార్ విందులో రాజకిషోర్‌బాబు, దూదేకులు, ముస్లిములు

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత రిటైర్డు ఎస్‌పి రాజకిషోర్‌బాబు, రిటైర్డు ఎస్‌పి షేక్ షావలి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవన్‌లో రంజాన్ మాసంలో రోజా ఉపవాస దీక్ష పాటించిన వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం బహుళ జాతులు సమ్మేళనమని, అందరినీ సమానంగా ఆదరించాలని తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాసం పాటించిన ముస్లిమ్, దూదే కులనే బేధాలు లేకుండా మతాలకతీతంగా గౌరవించామన్నారు. దూదేకుల సోదరులు సంస్కృతిని పరిరక్షణ తోపాటు విద్యాపరంగా ముందంజలో ఉండాలని తెలిపారు. విద్యతో మానవ నాగరికత విలసిల్లిన సంగతిని గుర్తుంచుకోవాలని తెలిపారు. సమాజమంతా విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వడాన్ని దూదేకుల సోదరులు గమ నించా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యా సంఘం నాయకులు సిద్ధయ్య మాట్లాడుతూ దూదేకుల భవనాన్ని మరింత ఆధునీకరించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. త్వరలోనే రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వ్యయంతో విస్తరించే ఆలోచన చేస్తు న్నామని తెలిపారు. ఇందుకు ఇద్దరు దాతలు ముందుకు వచ్చార న్నారు. ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ నూర్‌మహ్మద్ మాట్లాడుతూ దూదేకులు విద్యాభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించాలన్నారు. విద్యతోనే ఎదుగుదల ఉంటుందని గమనించాలని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా బిసి సంఘం నాయకులు లింగమూర్తి, తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు కల్యాసుధాకర్, గోవిందు నాగరాజు హాజరై సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం గౌరవా ధ్యక్షులు ఓబులేసు , మన్నూరు అక్బర్, ఓ. రసూల్, నజీర్, దూదేకుల బాదుల్లా, రాజంపేటకు చెందిన ఇమామ్‌లు, రాయచోటికి చెందిన ఉపాధ్యాయ సంఘ నాయకులు సిద్ధయ్య, చిన్నరాజా, సుభాన్, అజ్మతుల్లాతోపాటు వందలాది మంది సంఘం నాయకులు పాల్గొన్నారు.



రవిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఆదిరెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన ఆదిరెడ్డిగారి ఆదినారాయణరెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. గత వారం ఆదినారాయణరెడ్డి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆదివారం కొండాపురంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదినారాయణరెడ్డి మృతి బాధాకరమన్నారు. అన్ని విధాలా ఆదుకుంటామని ఆదినారాయణరెడ్డి కుమారుడు రవిరెడ్డికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చింతారాజ నరసింహారెడ్డి, అనంతపురం పెద్దిరెడ్డి, రామిరెడ్డిపల్లి సర్పంచు సుదర్శన్‌రెడ్డి, ఏటూరు సూర్య నారాయణరెడ్డి, చౌటిపల్లి వెల్లాల రామలింగేశ్వరరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కొండు వినోద్‌కుమార్ రెడ్డి, వెల్లాల రామాంజల్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, నన్నేబాషా, ఎద్దు ఓబులేసు, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

12న తాళ భజన పోటీలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఈనెల 12న రాత్రి 8 గంటలకు తాళ భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈశ్వరస్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి కమిటీ సభ్యులు తెలిపారు. ఈశ్వరస్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ట 41 రోజు పురస్కరించుకొని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన తాళ భజన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం పోటీలు ఉంటాయని తెలిపారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు లాటరీ ద్వారా పోటీలు నిర్వహిస్తామన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న హైటెక్ ఫయాజ్

విభిన్న ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రంజాన్ మాసం పురస్కరించుకొని మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో 50 మంది విభిన్న ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హైటెక్ ఫయాజ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పేదలు ఈ వేడుకలకు దూరం కాకూడదనే గొప్ప మనసుతో ఆలోచించి విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమం ప్రతి ఒక్కరూ చేపట్టాలని కోరారు. వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ బాషా, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ కిశోర్, వెంకటసుబ్బయ్య, హనుమంతు, అల్తాఫ్, భద్రుడు పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

వ్యాపారాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వ్యాపారంలో నాణ్యత పాటిస్తూ అభివృద్ధి సాధించాలని పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, పులివెందుల వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి సూచించారు. స్థానిక కడప రోడ్డులో గురుకుల పాఠశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన గార్డెన్ డిలైట్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రెస్టారెంట్‌కు వచ్చిన వారిని మర్యాదపూర్వకంగా పలకరించాలన్నారు. నాణ్యతమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. ముందుగా రెస్టారెంట్ నిర్వాహకులు గజ్జల బాల అశ్వత్‌రెడ్డి, గజ్జల నారాయణస్వామిరెడ్డి, ఆది నారాయణ రెడ్డి, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, భాస్కర్ అతిథులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, నాయకులు పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, సికె వెంకటనాథరెడ్డి, ఒ రసూల్, వెంకటసుబ్బయ్య, సోపాల వీర, సంపత్ పాల్గొన్నారు.

15న విశ్వవిద్యాలయంలో ఏకపాత్రాభినయం

ప్రజాశక్తి కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య జింక రంగ జనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, మార్గదర్శకత్వంలో ఈనెల 15న ఏకపాత్రాభినయం నాటికలు ప్రదర్శిస్తారని లలితకళల విభాగం సమన్వయకర్త డాక్టర్ కోట మృత్యుంజయరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవ సందర్భంగా వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో రంగస్థల కళల విద్యార్థులచే ఏకపాత్రాభినయాలు, పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచించిన 'సైసైరా నరసింహారెడ్డి' నాటకం ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

ఆశాజనకంగా వేరుశనగ పంట

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రబీలో రైతులు సాగుచేసిన వేరుశనగ పంట ఆశాజనకంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట సాగుకు పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. వేరుశగన పంట సాగు దశ నుంచి విడతల వారీగా ఎకరాకు దాదాపు రూ.35 వేల నుంచి రూ.37 వేల వరకు పెట్టుబడి వస్తుంది. సేద్యానికి రూ.2,600, అడుగు పిండికి రూ.2,500, క్వింటాల్ పల్లీలకు రూ.10,500, విత్తనాలు వేయడానికి రూ.1,200, గులికలకు రూ.400, రెండు సార్లు స్ప్రే చేయడానికి రూ.5వేలు, కలుపు రెండుసార్లు తీయుటకు రూ.5వేలు, చేను తీయడానికి, మిషన్‌కు, ఇతర ఖర్చులు కలిపి పెట్టుబడి ఎక్కువగానే ఉంటుంది. సాధారణ దిగుబడి వస్తే అన్నీపోనూ రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు లాభం వస్తుంది. ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.7000 క్వింటా లెక్కన రూ.70,000 వేల వరకు వస్తుంది. పెట్టుబడి రూ.35 వేలు పోనూ రూ.35 వేల వరకు రైతుకు మిగులుతుందని రైతులు పేర్కొంటున్నారు.



నెరవేరని లక్ష్యం

- సామూహిక గృహప్రవేశాలు ఇప్పట్లో లేనట్లేనా.. మల్లగుల్లాలు పడుతున్న అధికారులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం గత మార్చి నెల 21న సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టనున్నట్లు ప్రకటించినా.. అది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు పూర్తికాలేదు. కొందరు పునాదులు, మరికొందరు రూఫ్ లెవల్, ఇంకొందరు శ్లాబ్ వరకూ నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. ఆది నుంచి ఇళ్ల నిర్మాణంలో ఆశించిన పురోగతి లేదు. ఊరికి దూరంగా లే అవుట్లు కేటాయించడం, కొండలు, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో పట్టాలివ్వడం, లే అవుట్లలో వసతులు మెరుగుపరచకపోవడంతో ఆ పనులకు అడ్డంకిగా మారింది. తొలుత ప్రభుత్వమే నేరుగా ఇల్లు నిర్మిస్తామని చెప్పి వెనక్కి తగ్గడం కూడా జాప్యానికి కారణమవుతోంది. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలంలో ఇంటి నిర్మాణానికి చాలామంది విముఖత చూపారు. పైగా ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు మాత్రమే కేటాయించారు. ఆ మొత్తం ఎటూ చాలకపోవడంతో కొందరు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. బిల్లులు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో మరి కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు నిలిపేశారు. జిల్లాలో ఇప్పటికీ పనులు ప్రారంభించని ఇళ్లు 3,658, బిబిఎల్ దశ 31,015, బిఎల్ స్థాయిలో ఉన్న ఇళ్లు 35,810, ఆర్ఎల్ స్థాయిలో ఉన్న ఇళ్లు 7,694, ఆర్‌సీ స్థాయిలో ఉన్న ఇళ్లు 7,097, నిర్మాణాలు పూర్తయినవి 18,617గా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఇప్పుడిప్పుడే మౌలిక వసతుల కల్పన..

లే అవుట్లలో మౌలిక వసతులు కూడా అంతంతమాత్రంగా ఉన్నాయి. జిల్లాలో ఏడు నియోజక వర్గాలకుగానూ ప్రధానంగా ఇసుక లభ్యత లేకపోడం కూడా ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దాని ప్రభావం ఇళ్ల నిర్మాణంపై పడుతోంది. కాలనీల్లో రోడ్లు, కాలువల నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ విభాగానికి అప్పగించారు. అటు ఆర్‌డబ్ల్యూఎస్ బోర్ల తవ్వకాలపై దృష్టిపెట్టింది. ఇప్పుడిప్పుడే విద్యుత్ శాఖ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుచేసే పనిలో పడింది. ఇలా మౌలిక వసతులు కల్పించక ముందే ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని కోరుతుండడంతో చాలామంది లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. ఈ నేపథ్యంలో అనుకున్న సామూహిక గృహప్రవేశాల లక్ష్యం సాధ్యపడలేదు. సామూహిక గృహప్రవేశాలు ఇప్పట్లో లేనట్టేనా..? అనే సందేహాలు కలుగుతున్నాయి.



బొల్లవరం లే అవుట్ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న జగనన్న కాలనీ

టిడిపి గెలుపునకు కృషి : 'వరద'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో టిడిపిని గెలుపునకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1985 నుండి 2009 వరకు సుదీర్ఘంగా నన్ను రాజకీయాల్లో నిలబెట్టిన ప్రజల ప్రేమను ఎప్పుడూ మరువనన్నారు. 2009, 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందానని తెలిపారు. ఈ క్రమంలో రెండు సంవత్సరాలకు పైగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నానన్నారు. ప్రస్తుతం పొద్దుటూరులో లంచాలు, భూ కబ్జాలు, పంచాయితీలు ఎక్కువయ్యాయని తెలిపారు. కార్యకర్తలు, ప్రజలు తనను ప్రత్యక్ష ఎన్నికల్లో ఉండాలని కోరుకుంటున్నారన్నారు. 2024 ఎన్నికల్లో కచ్చితంగా పోటీలో నిలబడతానని తెలిపారు. త్వరలో టిడిపి అధినేత చంద్రబాబును కలవనున్నట్లు వరద తెలిపారు. ప్రస్తుతం టిడిపి ఇన్‌ఛార్జిగా ప్రవీణ్ కుమార్‌రెడ్డి బాధ్యత నిర్వహిస్తున్నారని, ఆయనతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అధినేత ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామన్నారు. తాను కూడా టికెట్ రేస్‌లో ఉన్నానని నిర్ణయం పార్టీ అధినేతదేనని వరదరాజులరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులో శాంతియుత వాతావరణం వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో జడ్‌పిటిసి, సర్పంచు

ప్రజాశక్తి - వేంపల్లె

వేసవిలో ప్రజల దాహం తీర్చే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం కో-ఆప్షన్ మెంబర్ హసనయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రయాణికులు, ప్రజలకు దాహం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రతి రోజూ సకాలంలో చలివేంద్రాల్లో తాగు నీటిని ప్రజలకు అందుబాటులో పెట్టాలని కోరారు. ప్రజాప్రతినిధులు మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటుకు ముందడుగు వేయాలని కోరారు. వేడి తీవ్రత అధికంగా ఉండడం వల్ల ప్రజలు అనవసరంగా బయట తిరగరాదని సూచించారు. ఎక్కువగా నీటిని తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు కటిక చంద్రశేఖర్, భారతి, వార్డు సభ్యుడు సునీల్, ఉమర్, బాలరాజు, వైసిపి నాయకులు చలమారెడ్డి, ఆది నారాయణరెడ్డి, మోహన్, కృష్ణయ్య, అయ్యవారప్ప, ఖాదర్ పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీరాములు రోడ్డు సాయి శ్రీ ఫిజియోథెరపీ క్లినిక్ సమీపంలో కొంగనపల్లి వెంకటనారాయణ, లక్ష్మీనారాయణమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కొంగనపల్లి శ్రీనివాసులు అతని సతీమణి కృష్ణవేణి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం మున్సిపల్ ఇన్‌ఛార్జి వైసిపి నాయకులు వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, గంగాధర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ హఫీజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడి రమణ, పార్నపల్లి కిషోర్, వైయస్‌ఆర్టీఎఫ్ నాయకులు వెంకటనాథ్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు హాలు రవి, చంద్రమౌళి, సంపత్, రవితేజ, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

చెరువు గట్ల వెంబడి కంపచెట్లే..!

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గ్రామాల చెరువుల గట్ల వెంబడి కంపచెట్లు పెరిగి దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని గూడెం చెరువు, పి.బొమ్మేపల్లి మధ్య ఉన్న గుడారమ్మ దేవి చెరువు గట్టుపై విపరీతంగా చెట్లు పెరిగి ఉన్నాయి. అలాగే వేమగుంటపల్లె చెరువు, సున్నపురాళ్లపల్లె చెరువు, కొత్తగుంటపల్లె చెరువుతోపాటు వివిధ గ్రామాల కుంటల వెంబడి కూడా కంపచెట్లు ఏపుగా పెరిగి ఉన్నాయి. వీటి వల్ల తీవ్ర అసౌకర్యాంగా ఉందని, వేసవికాలంలో చెరువు గట్లపై ఉన్న కంప చెట్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కనీసం 'ఉపాధి హామీ' పనుల కిందనైనా కంప చెట్లను తొలగించాలని వారు సూచిస్తున్నారు. పి. బొమ్మేపల్లి గ్రామానికి మూడు వైపులా చెరువు లున్నాయి. వాటి కట్టలపై అధికంగా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. బొమ్మేపల్లి, ఒంటిమిద్దే గ్రామాల మధ్య ఉన్న చెరువుగట్టుపై కూడా కంపచెట్లు అల్లుకుపోతున్నాయి. ఈ రెండు గ్రామాల మధ్య చెరువు కట్టనే రహదారిగా ఉంది. కంపచెట్లు అధికంగా పెరగడంతో మలుపుల వద్ద దగ్గరికి వెళ్లేంతవరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. దీంతో ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. సున్నపురాళ్లపల్లె చెరువు కొత్తగుంటపల్లి చెరువుల్లో కూడా చెట్లు విపరీతంగా పెరిగి ఉన్నాయి. వాటిని తొలగించడంలో సంబంధిత నాయకులు, అధికారులు చొరవచూపాలి.. లేని పక్షంలో వేర్లు చెరువు కట్ట లోపలికి చొచ్చుకువెళ్లి కట్టను బలహీనపరిచే పరిస్థితులు ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే నీరు లీకుల ద్వారా పోయి చెరువు కట్టలు తెగే అవకాశం కూడా ఉంది. ఈ వేసవిలో ఉపాధి పనుల ద్వారా చెరువు పూడిక పనులతోపాటు చెరువు కట్ట వెంబడి ఉన్న చెట్లను తొలగించడంలో సంబంధిత అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు. వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి ఏడాది కాలం నిలువ ఉంచుకోవాలంటే చెరువు కట్టలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు, నీటి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



పి.బొమ్మేపల్లి చెరువు కట్ట వెంబడి పెరిగి ఉన్న కంపచెట్లు, మలుపు వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లు

ఎంఐసిఎస్‌లో విప్లవాత్మక మార్పులు

ప్రముఖ కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ పి.ధీరజ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కోత లేకుండా కార్డియాక్ సర్జరీ నిర్వహిస్తున్నామని, ఎంఐ సిఎస్‌లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ప్రముఖ కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ పి ధీరజ్ రెడ్డి తెలిపారు. ఆదివారం అరుణాచల్ హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె శస్త్ర చికిత్సలో అందరికీ కలిగే భయం ఛాతి మధ్యభాగంలో కోత వేయడం వల్ల భారీ మచ్చ ఏర్పడుతుందని. ఆధునిక వైద్యంలో కోత లేకుండా ఛాతి మధ్య భాగంలో శస్త్ర చికిత్స చేయడం అనేది నూతన వైద్య విధానం వల్ల సాధ్యమైందని పేర్కొన్నారు. ఇందుకోసం రోబోటిక్ సహాయంతో, థొరా కోస్కోప్ కెమెరాలు ఉపయోగించి చాతిలోకి ఎడమ లేదా కుడి వైపున రెండు నుంచి మూడు అంగుళాలు చిన్న కోత ద్వారా శస్త్ర చికిత్స చేస్తున్నామని చెప్పారు. ఎంఐసిఎస్ వల్ల కణజాల గాయాని తగ్గిస్తుంది, రక్తం నష్టం కాకుండా చేస్తుంది, రక్తమార్పిడి పెద్దగా అవసరం ఉండదని పేర్కొన్నారు. తక్కువ సమయంలో శస్త్ర చికిత్స చేయడం వల్ల నొప్పి వంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఐసియూలో ఎక్కువ కాలం ఉండనవసరం లేదని చెప్పారు. రెండు నుంచి నాలుగు రోజుల్లో ఇంటికి వెళ్లిపోవచ్చని పేర్కొన్నారు. చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో అపోలో ఆసుపత్రి సీనియర్ జనరల్ మేనేజర్ నాగార్జున రెడ్డి, జనరల్ మేనేజర్ బాల భాస్కరరావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడతున్న డాక్టర్ ధీరజ్ రెడ్డి

దుంపలగట్టులో అంకాలమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని దుంపలగట్టు గ్రామంలో వెలసిన అంకాలమ్మ అమ్మవారి తిరుణాల ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అంకా లమ్మ తల్లిని దర్శించుకోవడానికి జిల్లా వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి చల్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఖాజీపేట అగ్రహారంలో అంకాలమ్మ అమ్మవారికి స్థానికులు బోనాలు సమర్పించారు. దుంపలగట్టులో టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, ఆయన భార్య లక్ష్మీ ప్రసన్న, కుమా రుడు వెంకటసాయి ప్రత్యూష్‌రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రెడ్యం కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ప్రత్యేక ప్రార్థనలో క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈస్టర్ పండుగను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని సిఎస్ఐ క్రైస్ట్ టౌన్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవరెండ్ స్టీఫెన్ పాల్ ఈస్టర్ పండుగ ప్రాశస్త్యం వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీలు మైత్రీ సమాజం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముద్దనూరు : ఈస్టర్ పర్వదినం సందర్భంగా మండలంలోని అన్ని చర్చీల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ పాస్టర్ దేవ సహాయం, సిఎస్ఐ (ఎస్పీజి)చర్చిలో రెవరెండ్ పాస్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఈస్టర్ ప్రత్యేకతను వివరించారు. ఆర్‌సిఎం, హెబ్రోన్, మన్నా, హోసన్నా, గుత్తిశాల ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - కడప

కడప నగరం, 48 డివిజన్ కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, శాంతమ్మ ఆధ్వర్యంలో పేదల మధ్య క్రీస్తు పున రుద్ధాన ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సం దర్భంగా పేదలకు అన్నదానం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, విశ్వాసులు పి.రవితేజ, శాంతిరాజు, ఏ.అగస్టిన్, అశోక్, తిమప్ప, రోజా, నరసయ్య, అంజలి, శ్రావణి, లక్ష్మీ అనేక మంది భక్తులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న పాస్టర్ మహేష్, శాంతమ్మ

మానవతామూర్తి హకీం మంజుమియా

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరానికి చెందిన మొన్నటితరం ప్రముఖుడు, గొప్పవైద్యుడు హకీం మంజుమియా మానవతా మూర్తిగా కీర్తి గడించారని యోగి వేమన విశ్వ విద్యాలయం చిత్రలేఖన విభాగం అధిపతి డాక్టర్ కోటా మృత్యుంజయరావు అన్నారు. హకీం మంజుమియా వర్ధంతి సందర్భంగా ఆదివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మృత్యుంజయరావు మాట్లాడుతూ హకీంగా ఆయన జిల్లా వాసులకు అప్పట్లో అనితర సాధ్యమైన సేవలను అందించారని పేర్కొన్నారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ హకీం మంజుమియా ధాతృత్వానికి చిహ్నంగా నేటికీ కడప నగరంలో పలు గుర్తులు ఉన్నాయని తెలిపారు. సంస్థ చీఫ్ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ హకీం మంజుమియా గురించి నేటితరం వారికి తెలియదని, ఆయన జీవిత విశేషాలతో పుస్తకాన్ని వెలువరించాల్సిన అవసరం ఉందన్నారు. రచయిత కె.వి. రమణారెడ్డి, రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్ రాజు, పర్యాటక ఫొటోగ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వరరావు, రేడియో వ్యాఖ్యాత గంగాధర్, డేవిడ్, విజయ్, సతీష్ పాల్గొన్నారు.

సినీనటి కరాటే కల్యాణికి సన్మానం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

సినీనటి, యాదవ సంఘం జాతీయ హక్కుల అధ్యక్షురాలు, మా అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కరాటే కళ్యాణిని పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ నాయుడు దంపతులు ఘనంగా సన్మానించారు కరాటే కళ్యాణి మండలంలోని అక్కంపేటలో వెలిసిన విభూతి శివలింగం ఆలయంలో శనివారం రాత్రి హరికథ గానం చేసి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో పోరు మామిళ్లలో సర్పంచ్ సుధాకర్ నాయుడు ఆహ్వానం మేరకు విచ్చేశారు.ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ సాంప్రదాయ కళలైన హరికథ అంతరించిపోతుందన్నారు. జీవం పోసి కలకాలం ఉండాలని విజయనగరం జిల్లాలోని గంజేరు గ్రామం దగ్గర గోశాలతోపాటు హరికథ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఆవరణలో 108 అడుగుల కృష్ణుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తన తండ్రి హరికథ గానం చేయడంలో సుప్రసిద్ధుడని ఆయన కోరిక మేరకు ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అందరికి సహకారంతో దాతల సహాయంతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి పరుస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ షరీఫ్, అతిగారి రాజా, పాల్గొన్నారు.



కరాటే కల్యాణిని సన్మానించిన సర్పంచు

క్రైం కార్నర్

ఘర్షణలో ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని క్రిస్టియన్ లైన్‌లో ఈస్టర్ పండగ సందర్భంగా ఆదివారం యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న సంఘటనలో ఇరువురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఈస్టర్ పండగ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ, ద్విచక్ర వాహనానికి సైలెన్సర్ తీసేసి పెద్ద శబ్దంతో కాలనీలో తిరుగుతూ అసభ్యపరంగా ప్రవర్తించడంతో, కాలనీవాసులు ఎదురు తిరిగారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. రాడ్లు, కట్టెలు, రాళ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో ఒక వర్గానికి చెందిన రవితేజ అనే యువకుడి తలకు గాయాలు కాగా, మరొక వర్గానికి చెందిన ప్రకాష్‌కు గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారిస్తున్నామని సిఐ రాజు తెలిపారు.



గాయపడిన రవితేజ